


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :108 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ బుధవారం 12-08-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## రేవంత్‌రెడ్డి షెల్ కంపెనీల బాగోతాన్ని బయట పెడతాం: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 11: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. ఈరోజు (మంగళవారం) తెలంగాణ భవన్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు.

**శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా..?**

శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గారా.? అని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెకరాలను కేటాయించడంపై కేసు నమోదైందని ప్రస్తావించారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఎనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు చైర్మన్‌గా ఉన్నానని ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి ఆ సంస్థతో సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని పేర్కొన్నారు.

**అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తాం..**

తెలంగాణలో రూ.74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత తమ పార్టీ నేతలు, న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా.?, లేదా.? స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండాను మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్రప్రభుత్వం చెప్పినా రాష్ట్ర బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ఈ ప్రభుత్వం చేయాల్సిన పనిని సక్రమంగా చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

## 71 లక్షల మంది ఓట్ల తొలగింపు.. ముగిసిన ఎస్ఐఆర్ డెడ్‌లైన్..

హైదరాబాద్, ఆగస్టు 11, తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 3.38 కోట్ల మంది ఓటర్లలో దాదాపు 71 లక్షల మంది ఓటర్లు అన్‌కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నట్లు తేలింది. ఇందులో సగానికి పైగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనే ఉన్నట్లు వెల్లడైంది. ఇక నేటితో ఎస్ఐఆర్ గడువు ముగియడంతో ఇప్పుడు ఫారాల పరిశీలన, ధ్రువీకరణ అనంతరం తుది ఓటర్ల జాబితా ఎలా ఉండబోతోందన్న దానిపై సర్వత్రా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో.. తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది. తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి.ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో సుమారు 9.1 లక్షల మంది మరణించినవారు ఉండగా.. 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించని వారిగా గుర్తించారు. మరో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు.. 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఇప్పటికే అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే గడువు ముగియగా.. ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి మరిన్ని ఎన్యుమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉండటంతో తుది తొలగింపు సంఖ్యలో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఆగస్ట్ 9వ తేదీ నాటికి సుమారు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావాల్సి ఉండగా.. మిగిలిన ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు.ఎస్ఐఆర్‌లో అత్యధికంగా అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదైన ప్రాంతంగా గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలు కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇవి దాదాపు 58.6 శాతానికి సమానం.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో



భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను సేకరించడంలో అనేక ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ ఇళ్లను మార్చడం.. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం.. మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉండటం, మరణించిన ఓటర్ల పేర్లు కొనసాగడం వంటి కారణాలు అన్‌కలెక్టబుల్ కేసులు పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఓటర్ల వివరాల్లో అనామలీస్ (వివరాల్లో తేడా ఉండటం) శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లా స్థాయిలో ఆదిలాబాద్‌లో 28.5 శాతం ఓటర్ల వివరాల్లో అనామలీస్ గుర్తించారు. నిజామాబాద్‌లో 27.4 శాతం, నిర్మల్‌లో 26.1 శాతం, మెదక్‌లో 24.6 శాతం, కామారెడ్డిలో 23.9 శాతం, సంగారెడ్డిలో 23.8 శాతం నమోదు అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 30.4 శాతం అనామలీస్‌తో అత్యధికంగా ఉండగా.. నారాయణఖేడ్‌లో 29.3 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 28.4 శాతం, షాద్‌నగర్‌లో 28.3 శాతం, నిర్మల్‌లో 28.29 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 28.1 శాతం నమోదయ్యాయి.ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు సుమారు 2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి.. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ధ్రువీకరించినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో 78.1 శాతానికి సమానం. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు గడువు ముగియడంతో ఇప్పుడు అధికారుల తదుపరి చర్యలపై దృష్టి నెలకొంది. ఇప్పటికే అందిన ఫారాల పరిశీలన, డేటా ధ్రువీకరణ, అభ్యంతరాలు-దరఖాస్తుల పరిశీలన వంటి ప్రక్రియల తర్వాతే తుది ఓటర్ల జాబితాలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయన్నది స్పష్టమవుతుంది.మరీ ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో భారీగా అన్‌కలెక్టబుల్ కేసులు.. ఉత్తర-పశ్చిమ తెలంగాణలో అధిక

## పేద పిల్లల కలలకు చిరునామాగా.. యంగ్ ఇండియా స్కూల్స్: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11: తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నాయని సీఎం వెల్లడించారు.

**సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్..**

'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి.

ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను



రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా... తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

## నాణ్యతా ప్రమాణాలు లేకుండా చేస్తున్న యూజీడీ పనులను నిలిపివేయాలి



కోదాడ,కోదాడ పట్టణంలో కొనసాగుతున్న యూజీడీ పనులు ప్రజలకు ప్రయోజనం కల్పించాల్సింది పోయి తీవ్ర ఇబ్బందులు, అసౌకర్యాలు, ప్రమాదాలకు కారణమవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. నాణ్యతా ప్రమాణాలు, శాస్త్రీయ పద్ధతులు, ముందస్తు భద్రతా చర్యలు పాటించకుండా పనులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం పట్ల అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.కోదాడ పట్టణంలోని 22వ వార్డులో జరుగుతున్న యూజీడీ పనులను మల్లయ్య యాదవ్ పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజీడీ పనుల కోసం రోడ్లను తవ్వి నెలల తరబడి పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తవ్విన గుంతలను అలాగే వదిలేయడం, రాత్రి వేళల్లో హెచ్చరిక బోర్డులు, భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పనులపై అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు.మంచినీటి పైపులు, డ్రైనేజీ కనెక్షన్లు, విద్యుత్ లైన్లు, రోడ్లు దెబ్బతింటున్నప్పటికీ వెంటనే మరమ్మతులు చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్న సందర్భాలు ఉన్నాయని తెలిపారు. యూజీడీ పనులకు ఏర్పాటు చేస్తున్న పైపుల సామర్థ్యం, డిజైన్, భవిష్యత్ పట్టణ అవసరాలపై నిపుణులతో సమగ్ర పరిశీలన చేయాలని కోరారు. తగిన సామర్థ్యం లేని పైపులు ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ప్రజలు మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.యూజీడీ పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని, కాలువల శుభ్రతపై అధికారులు దృష్టి సారించాలని సూచించా రు. పారిశుధ్య లోపంతో దోమల సమస్య పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాంట్రాక్ట్ సంస్థ పనితీరుపై గతంలోనే తమ పార్టీ ఆరోపణలు చేసిందని పేర్కొన్న ఆయన, పనుల కేటాయింపులో ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయా అనే అంశంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఉపయోగపడాల్సిన వందల కోట్ల రూపాయల పనులు నాణ్యత లేకుండా జరిగితే చివరకు నష్టపోయేది కోదాడ ప్రజలేనని మల్లయ్య యాదవ్ అన్నారు. ప్రజాధనం సక్రమంగా వినియోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ పట్టణ పారిశుధ్యం, సుందరీకరణ కోసం చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. ప్రస్తుతం పారిశుధ్య సమస్యలు, యూజీడీ పనుల ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలి...

న్యూఢిల్లీ, ఆగస్టు 11: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న పురస్కారాన్ని ఇవ్వాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. స్వాతంత్ర్య సమరయోధుడికి, భారత జాతీయ పతాక రూపకర్తకు దేశం అందించగల ఏకైక సముచితమైన నివాళి ఇదే అని చెప్పుకొచ్చారు. భారత జాతీయ పతాకం(త్రివర్ణ పతాకం) ప్రాథమిక రూపాన్ని రూపొందించిన ఘనత పింగళి వెంకయ్యకే దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో పింగళీ వెంకయ్య విగ్రహాన్ని తాను ఏర్పాటు చేసినట్లు లేఖలో తెలిపారు.ఇప్పుడు భారత జాతీయ పతాకం ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యాన్ని, విస్తృత గుర్తింపును సాధించిందని వీహెచ్ అన్నారు. దివంగత పింగళి వెంకయ్య సేవలను తక్కువ చేసి చూడటం.. భారత పతాక రూపకర్తకు జరిగిన అవమానమన్నారు. తెలుగు రాష్ట్రానికి పింగళి వెంకయ్య సేవలను మోదీ ఎందుకు మరచిపోయారో అర్థం కావడం లేదని తెలిపారు.. పింగళి వెంకయ్యకు భారత రత్న ఇవ్వాలని.. దేశ ప్రజలు ఇదే అభిప్రాయాన్ని కలిగి ఉన్నారని వెల్లడించారు.'ప్రధాని మోదీ 'హర్ ఘర్ తిరంగా'



అంటున్నారు.. మంచిదే. జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు సరైన న్యాయం జరగాలంటే భారతరత్న ఇవ్వాల్సిందే. పింగళి వెంకయ్యకు న్యాయం జరగడం వల్ల ప్రజల్లోకి ఒక మంచి సందేశం వెళ్తుంది. స్వాతంత్రం వచ్చిన 25 ఏళ్ల తర్వాత ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై జాతీయ జెండా ఎగరవేశారు' అని ప్రధానికి వీహెచ్ లేఖ రాశారు.

## పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు



హైదరాబాద్, ఆగస్టు 11 : పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు పత్తి అమ్మే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 2026-27 సీజన్‌లో 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నట్లు అంచనా వేశామని తెలిపారు. ఈరోజు (మంగళవారం) సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లపై మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తిని అంచనా వేస్తున్నామని చెప్పారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు రూ.8,667 ఎంఎస్పీ ధర ఉందని అన్నారు. గతేడాదితో పోలిస్తే రూ.557ల ఎంఎస్పీ ధర పెరిగిందని తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు 122 నుంచి 131కు పెంచారని వెల్లడించారు.

**జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలి..**

తెలంగాణలో 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. 15 నుంచి 30 రోజుల్లో అన్ని జిల్లాల్లో ఈ మిల్లులను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రైతుల ప్రతినిధులతో జిల్లా మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. మధ్యవర్తుల జోక్యానికి తావులేకుండా నేరుగా పత్తి కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ మరింత సరళీకరణ చేస్తున్నట్లు వివరించారు. అధిక దిగుబడి రైతులకు వెంటనే డిజిటల్ ield Certificates ఇస్తున్నట్లు వెల్లడించారు. జిన్నింగ్ మిల్లుల్లో నాణ్యత పరీక్ష పరికరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

**సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నాం..**

కొనుగోలు కేంద్రాల్లో సీసీటీవీలు, బరువు యంత్రాలపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తుమ్మల చెప్పారు. రద్దీ, పెండింగ్ ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులు ఫిర్యాదులు చేయడానికి టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 599 5779, వాట్సాప్ చాట్‌బాట్: 88972 81111లో సంప్రదించాలని సూచించారు. అన్నదాతకు ఎంఎస్పీ ధర అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వ్యాఖ్యానించారు. పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

**పోటాపోటీ నిరసనలు..**

న్యూఢిల్లీ,రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం



## సంపాదకీయం

**బుధవారం 12-08-2026**

# పొలాలే పోషకాల బ్యాంకులు

హరిత విప్లవంతో భారత్ ఆహార ధాన్యాల్లో స్వావలంబన దిశగా అడుగులు వేసింది. కానీ, అదే సమయంలో రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడే పరిస్థితి వచ్చింది. దీంతో ఎరువుల సబ్సిడీ కోసం ప్రభుత్వం ఏటా పెద్దమొత్తంలో ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ- అన్నదాతలకు ఆర్థిక భారం తప్పడం లేదు, నేల ఆరోగ్యం మెరుగుపడటం లేదు, ఎరువుల వినియోగ సామర్థ్యమూ పెరగడం లేదు. ఇలాంటి తరుణంలో భూసార పరీక్షలు, సర్వే నంబర్ ఆధారిత పోషక మ్యాపింగ్, ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవసాయ సేవలు వెరసి... రైతుకు లాభదాయకమైన, ప్రభుత్వానికి ఆర్థికంగా ప్రయోజనకరమైన, పర్యావరణానికి మేలుచేసే సరికొత్త వ్యవసాయ వ్యవస్థను నిర్మించగలవనే ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఎరువుల సబ్సిడీ కోసం సుమారు రూ.1.8లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. గడచిన అయిదు దశాబ్దాల్లో ఎరువుల రూపంలో కోట్లాది టన్నుల ఫాస్పరస్, పొటాషియం, నైట్రోజన్‌లు పొలాల్లోకి చేరాయి. కానీ, వాటిలో చాలామటుకు పంటల ద్వారా వినియోగం కాకుండా, వ్యవసాయ క్షేత్రాల అడుగు భాగంలో 'పోషకాల బ్యాంకు'గా పోగుపడ్డాయి. ఏఐ ఆధారిత పోషక నిర్వహణ వ్యవస్థ ద్వారా దాన్ని సమర్థంగా వినియోగించుకోగలిగితే... రైతులపై ఎరువుల భారం, ప్రభుత్వానికి సబ్సిడీల ఖర్చు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. దిగుబడులకూ ఢోకా ఉండదు. ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తాను రైతుకు రూ.266కే అందిస్తున్నారు. కానీ ఉత్పత్తి, దిగుమతి ఖర్చులు కలిపితే దాని వాస్తవ విలువ రూ.2వేలకు పైనే ఉంటుంది. అదే విధంగా 'డీఏపీ' బస్తాపై సుమారు రూ.1,500 వరకు సబ్సిడీ ఇస్తున్నారు. ఇలా 2024-25లో ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం సుమారు రూ.1.91లక్షల కోట్లకు పైగా వెచ్చించింది. ఇది కొన్ని రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఎక్కువ.

నేలలో పొటాషియం నిల్వలు

దేశంలో యూరియా వినియోగ సామర్థ్యం 30-45 శాతమే ఉంటోంది. అంటే, రైతు వేసిన యూరియాలో సగానికి పైగా పంటకు ఉపయోగపడకుండా వర్షంలో కొట్టుకుపోవడమో, ఆవిరికావడమో, నేలలో నష్టపోవడమో జరుగుతోంది. పొలంలో నత్రజని అవసరం ఎంతనేది పంట, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, గత ఎరువుల వినియోగం వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. కానీ చాలాచోట్ల వరి అయితే ఇంత యూరియా, పత్తి అయితే ఇంత యూరియా అనే సిఫార్సులు చేసేస్తున్నారు. ఇది వైద్యుడు రోగులను పరీక్షించకుండా, అందరికీ ఒకేలాంటి మందు ఇవ్వడం లాంటిదే! డీఏపీ ద్వారా రైతు వేసే ఫాస్పరస్‌లో 15-30 శాతమే మొదటి పంట వినియోగించుకుంటుంది. మిగతా 70-85 శాతం నేలలో కాల్షియం, ఇనుము, అల్యూమినియం సంయోగాలతో కలిసి నిల్వ అవుతుంది. ఏళ్ల తరబడి ఇలాగే కొనసాగితే నేలలో వాటి నిల్వలు భారీగా పేరుకుపోతాయి. దేశవ్యాప్తంగా చేపట్టిన పరిశోధనల్లో మొదట 10-15 కిలోల మేర భాస్వరం కలిగిన నేలలు 20ఏళ్ల తరవాత 40-100 కిలోల స్థాయికి చేరినట్లు గుర్తించారు. పంజాబ్, హరియాణా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకల్లో అనేకచోట్ల నేల పరీక్షలు అధిక, అత్యధిక ఫాస్పరస్ స్థాయులను చూపిస్తున్నాయి. తెలంగాణ, రాయలసీమ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లోని నల్లరేగడి నేలలు సహజంగానే పొటాషియం నిల్వలను కలిగి ఉంటాయి. దశాబ్దాలపాటు 'ఎంవోపీ' వినియోగం కొనసాగితే ఈ నిల్వలు మరింత పెరుగుతాయి. ఇప్పటికే చాలాచోట్ల పొలాల్లో పొటాషియం నిల్వలు అధికంగా ఉన్నట్లు తేలింది. మట్టి పరీక్షలను బట్టి నేలలో ఫాస్పరస్(భాస్వరం) 'అధికం'గా ఉంటే డీఏపీ వినియోగాన్ని 25-50శాతం తగ్గించాలి. అదే 'అత్యధికం'గా ఉంటే కొన్ని సీజన్లపాటు డీఏపీని పూర్తిగా నిలిపివేయాలి. పొటాషియం అధికంగా ఉంటే ఎంవోపీ వినియోగాన్ని 25-75 శాతం తగ్గించుకోవచ్చు. దీనివల్ల ఒక్కో ఎకరానికి రూ.2-5వేల వరకు ఆదా అవుతుంది. ఏఐ ఆధారిత మట్టి పరీక్ష గతంలో వేసిన ఎరువులు, దిగుబడులను విశ్లేషించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎంత దిగుబడి సాధించవచ్చనేది అంచనా వేస్తుంది. ఆ మేరకు సదరు పొలానికి ఎంత పొటాషియం, ఫాస్పరస్, నైట్రోజన్ అవసరమో సూచిస్తుంది. సీజన్‌ను బట్టి మొత్తం ఎన్ని కిలోల యూరియా అవసరం, మొక్కలు వివిధ దశల్లో ఉన్నప్పుడు ఎంతెంత పరిమాణంలో అందించాలో కూడా చెబుతుంది. రైతులు మొబైల్ యాప్ ద్వారా పంపిన మొక్కల ఫొటోలను ఏఐ విశ్లేషించి, పంట సరైన దశలో ఉందా లేదా అనేదీ నిర్ధారిస్తుంది. ఉపగ్రహ చిత్రాలు, డ్రోన్ పర్యవేక్షణ సైతం ఇందుకు ఉపయోగపడతాయి.

ఆమోదించిన మోతాదులోనే ఎరువులు...

ఏఐ ఆధారిత వ్యవస్థతో ఎరువుల డీలర్, పీఏసీఎస్ కేంద్రాన్ని అనుసంధానిస్తే... పొలం తాలూకా సర్వే నంబర్ ఆధారంగా ఏఐ ఆమోదించిన మోతాదులోనే యూరియా, ఇతర ఎరువులను అందించవచ్చు. తద్వారా అనవసరమైన రసాయనాల వాడకాన్నీ, నకిలీ క్లెయిమ్‌లను, సబ్సిడీ దుర్వినియోగాన్నీ అరికట్టవచ్చు. తద్వారా యూరియా వినియోగం సగటున 20-30శాతం, ఖర్చు 15-20శాతం తగ్గుతాయి. దిగుబడులు స్థిరంగా కొనసాగుతూ, నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రభుత్వంపైనా సబ్సిడీ భారం గణనీయంగా తగ్గి, విదేశ మారకద్రవ్యం ఆదా అవుతుంది. పర్యావరణ కాలుష్యాన్నీ కొంతవరకు కట్టడి చేయడం వీలవుతుంది. కాబట్టి కేంద్రం, రాష్ట్రాలు మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించి, ప్రతి సర్వే నంబర్‌కూ డిజిటల్ పోషక పాస్‌పోర్ట్ రూపొందించాలి. ఏఐ ఆధారిత పోషక విశ్లేషణ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యక్తిగత ఎరువు సిఫార్సులు, దశలవారీ ఎరువుల విడుదల వ్యవస్థ, సబ్సిడీని పోషక అవసరాలకు అనుసంధానించడం వంటి చర్యలు తీసుకోవాలి. భారతదేశ సేద్య రంగం భవిష్యత్తు ఎరువులను గుమ్మరించడంలో లేదు- సరైన సమయంలో, సరైన మోతాదులో, పొలానికి సరైన ఎరువులు అందించడంలోనే ఉంది!

# విజయ్ వర్సెస్ స్టాలిన్...



చెన్నై, విజయ్ పిలిచారు.. స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు రాలేదు. అన్నాడీఎంకే కూడా దూరంగానే నిలిచింది. మరోవైపు కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, ఎండీఎంకేకు చెందిన ఎంపీలు మాత్రం విజయ్‌తో కలిసి కూర్చున్నారు. అంటే విజయ్ పిలుపును పూర్తిగా తిరస్కరించిన పరిస్థితి లేదు. అదే సమయంలో అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యం కూడా పూర్తిగా నెరవేరలేదు. అందుకే ఈ సమావేశాన్ని విజయ్ విజయం అనీ.. వైఫల్యం అనీ ఒక్క మాటలో చెప్పలేం. అసలు డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పునఃసర్దుబాటు చేస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నది తమిళనాడు పార్టీల ఆందోళన. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ముందున్న రాష్ట్రాలకు.. తర్వాత పెరిగిన జనాభా ఆధారంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం న్యాయం కాదన్న వాదన చాలాకాలంగా ఉంది. అందుకే డీలిమిటేషన్ తమిళనాడులో కేవలం నియోజకవర్గాల లెక్క కాదు.. రాష్ట్ర హక్కుల అంశంగా మారింది. ఈ అంశంపై డీఎంకే ఇప్పటికే పోరాటం చేస్తోంది. స్టాలిన్ నేతృత్వంలో గతంలోనే అఖిలపక్ష సమావేశాలు కూడా జరిగాయి. తమిళనాడుకు అన్యాయం జరగకూడదన్న వాదనను డీఎంకే జాతీయ స్థాయిలో కూడా వినిపించింది. అంటే డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటం విజయ్‌తో మొదలైంది కాదు. మరి ఇప్పుడు విజయ్ అదే అంశంపై ప్రత్యేకంగా ఎంపీల సమావేశం ఎందుకు పెట్టారు? అన్నదే అసలు రాజకీయ ప్రశ్న. ఇక్కడే విజయ్ రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఒక సమస్యపై అన్ని పార్టీలను ఒకే టేబుల్ దగ్గరకు తీసుకురావడం ద్వారా తాను కేవలం ఒక పార్టీ అధినేతను కాదని.. తమిళనాడు ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్లగల నాయకుడిననే ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక రాజకీయ విజయం. కానీ ప్రత్యర్థి పార్టీలతో కూడా ఒక రాష్ట్ర ప్రయోజనం కోసం మాట్లాడగల స్థాయిని చూపించడం మరో రకమైన నాయకత్వ పరీక్ష. అయితే ఈ సమావేశానికి స్టాలిన్ రాకపోవడమే ఇప్పుడు విజయ్‌కి అతిపెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. స్టాలిన్ వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. విజయ్ పిలుపునకు స్పందించి స్టాలిన్ కూడా అదే వేదికపై కూర్చుని తమిళనాడు హక్కుల కోసం కలిసి పోరాడతామని ప్రకటించి ఉంటే.. విజయ్ రాజకీయ ఇమేజ్‌కు అది భారీ బూస్ట్ అయ్యేది. తనకంటే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్‌ను కూడా ఒక సమస్యపై తన వేదికపైకి తీసుకురాగలిగాడనే ప్రచారం జరిగేది. కానీ స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు కూడా రాలేదు. ఇది విజయ్‌కు ఒకవైపు ఎదురుదెబ్బ. కానీ రాజకీయంగా మరో అవకాశం కూడా. ఎందుకంటే ఇప్పుడు విజయ్ ప్రజల్లో ఒక ప్రశ్నను బలంగా తీసుకెళ్లవచ్చు. తమిళనాడు కోసం అందరినీ పిలిచాను.. కలిసి మాట్లాడుదామని చెప్పాను. ఎవరు వచ్చారు? ఎవరు రాలేదనేది మీరు చూశారని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి గైర్హాజరు కూడా ప్రచార ఆయుధంగా మారుతుంది. స్టాలిన్ విజయ్ వేదికపైకి వచ్చి ఉంటే.. విజయ్‌కి ఒక రోజు రాజకీయ మైలేజ్ వచ్చేది. రాకపోవడంతో.. విజయ్ దాన్ని ఒక నేరేటివ్‌గా మార్చుకునే అవకాశం వచ్చింది. అయితే ఇక్కడ మరో లెక్క ఉంది. తమిళనాడుకు చెందిన మొత్తం 57 మంది ఎంపీల్లో 20 మంది మాత్రమే సమావేశానికి రావడం అంటే దాదాపు 35 శాతం మంది మాత్రమే హాజరైనట్టే. మిగిలిన 37 మంది.. అంటే దాదాపు 65 శాతం మంది రాలేదు. కాబట్టి దీనిని అన్ని పార్టీల ఏకాభిప్రాయ సమావేశంగా చెప్పడం సాధ్యం కాదు. కానీ వచ్చిన 20 మంది వివిధ పార్టీలకు చెందినవారు కావడం మాత్రం విజయ్‌కు రాజకీయంగా ఉపయోగపడే అంశం. ముఖ్యంగా కాంగ్రెస్ రావడం.. డీఎంకే దూరంగా ఉండటం ఆసక్తికరమైన పరిణామం. డీఎంకేకు కాంగ్రెస్‌తో రాజకీయ సంబంధం ఉన్నప్పటికీ.. విజయ్ ఏర్పాటు చేసిన వేదికకు కాంగ్రెస్ ఎంపీలు రావడం ద్వారా డీలిమిటేషన్‌ను పార్టీ రాజకీయాలకు అతీతమైన అంశంగా చూడాలన్న వాదన బలపడింది. అయితే దీన్ని వెంటనే కాంగ్రెస్-డీఎంకే మధ్య విభేదాలకు సంకేతంగా చూడటం తొందరపాటే అవుతోంది. కానీ విజయ్ మాత్రం ఈ పరిణామాన్ని తన రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు తమిళ రాజకీయాల్లో ప్రధాన పోరు డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే. రెండు పెద్ద రాజకీయ ధృవాల చుట్టూనే ఎన్నికలు తిరిగేవి. ఇప్పుడు విజయ్ రంగంలోకి వచ్చారు. 2026 రాజకీయ సమీకరణాల్లో ఆయన ఎదుగుదలతో పాత లెక్కలకు కొత్త సవాలు ఎదురైంది. అందుకే డీలిమిటేషన్ వంటి రాష్ట్ర హక్కుల అంశం విజయ్‌కు కేవలం ఒక విధానపరమైన అంశం కాదు.. తన నాయకత్వాన్ని ప్రదర్శించుకునే రాజకీయ వేదిక కూడా. అయితే విజయ్ ముందున్న అసలు పరీక్ష ఇక్కడే ఉంది. ఒక సమావేశం పెట్టడం సులువు.. ఆ సమావేశాన్ని ఉద్యమంగా మార్చడం కష్టం. డీలిమిటేషన్‌పై నిజంగా పోరాడాలంటే పార్లమెంట్‌లో ఎంపీలను సమన్వయం చేయాలి. దక్షిణాది రాష్ట్రాలతో కలిసి వెళ్లాలి. కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. కేవలం తమిళనాడు ఎన్నికల రాజకీయాలకు పరిమితం కాకుండా జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. అప్పుడు మాత్రమే విజయ్ "తమిళ హక్కుల కోసం అందరినీ కలిపే నాయకుడు" అనే ఇమేజ్ బలపడుతుంది. లేకపోతే డీఎంకే నుంచి మరో కౌంటర్ రావచ్చు. డీలిమిటేషన్‌పై మేము ఎప్పటి నుంచో పోరాడుతున్నాం. కొత్తగా విజయ్ వచ్చి మీటింగ్ పెట్టడం వల్ల ఇది కొత్త పోరాటం కాదని చెప్పే వీలుంది. అదే విజయ్‌కు పెద్ద సవాలు. ఎందుకంటే డీలిమిటేషన్ అనే అంశంపై స్టాలిన్‌కు రాజకీయ చరిత్ర ఉంది. విజయ్‌కు మాత్రం ఈ అంశంపై రాజకీయంగా కొత్త అధ్యాయం మొదలవుతోంది. అందుకే ఈ సమావేశానికి కేవలం "20 మంది ఎంపీలు వచ్చారు.. 37 మంది రాలేదు" అనే అంకెలతో చూడటం సరిపోదు. అసలు కథ.. ఎవరు వచ్చారు, ఎవరు రాలేదు.. ఎందుకు రాలేదు.. విజయ్ ఈ వేదికను తర్వాత ఎలా ఉపయోగించబోతున్నారు అన్నదే. స్టాలిన్ రాలేదు కాబట్టి విజయ్ ఓడిపోయారని చెప్పలేం. 20 మంది వచ్చారు కాబట్టి విజయ్ గెలిచారని కూడా చెప్పలేం. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. డీలిమిటేషన్ పోరాటం పాతదే.. దానిపై విజయ్ వేసిన రాజకీయ అడుగు మాత్రం కొత్తది. స్టాలిన్ దగ్గర ఈ అంశంపై అనుభవం ఉంది. విజయ్ దగ్గర కొత్త రాజకీయ ఉత్సాహం ఉంది. ఒకరి దగ్గర పోరాట చరిత్ర ఉంటే.. మరొకరు దానికి కొత్త రాజకీయ వేదికను నిర్మించాలనుకుంటున్నారు. అందుకే విజయ్ పిలుపు.. స్టాలిన్ దూరం అనేది కేవలం ఒక సమావేశం కథ కాదు. తమిళనాడు హక్కుల పేరుతో మొదలైన ఈ పోరు.. రేపటి తమిళ రాజకీయాల్లో నాయకత్వ పోరుగా మారుతుందా? డీలిమిటేషన్ సీట్లను మారుస్తుందో లేదో వేచి చూడాలి.

### తిరుమలలో శ్రీవారి దర్శనానికి 20 గంటల సమయం

తిరుమల,తిరుమలలో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంది. సోమవారం ఉదయం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్మెంట్లు నిండిపోవడంతో భక్తులు వెలుపల ఉన్న క్యూలైన్లలో వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతోంది. నిన్న ఒక్కరోజే 87,179 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 34,256 మంది భక్తులు తలనీలాలు

# టీడీపీకి ఏమైంది.. నడిపిస్తున్నదెవరు?

అమరావతి,గత రెండేళ్ల పాలనలో టీడీపీ తీసుకున్న నిర్ణయాల్లో అత్యధికం వివాదాస్పదం అయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్క్ పరిపాలనకు పూర్తి విరుద్ధంగా వ్యవహారాలు సాగుతున్నాయి. ఇదేదో రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్న విమర్శ కానేకాదు. టీడీపీ కరుడు గట్టిన అభిమానులు, నాయకులు చేస్తున్న విమర్శ. తాజాగా విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు రాజీనామా వ్యవహారం టీడీపీ తిరోగమన, అప్రజాస్వామిక విధానానికి నిలువెత్తు నిదర్శనమనే విమర్శ వెల్లువెత్తుతోంది. ఈ ఘటనపై నిన్నమొన్నటి వరకు టీడీపీ శ్రేయోభిలాషిగా గుర్తింపు పొందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు చేసిన ట్వీట్ తీవ్ర చర్చనీయాంశమైంది. ఐసీయూలో పార్టీ, ప్రభుత్వం అని ఆయన ట్వీట్ చేశారు. అర్థం చేసుకునే వారికి చేసుకున్నంత. విజయా డెయిరీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని చలసానిపై మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, మరికొందరు తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇదేదో వాళ్ల సొంత వ్యవహారం కాదు. కేవలం ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే... చివరికి ఆస్పత్రిపాలైనా, ఐసీయూలో ఉన్నా విడిచి పెట్టలేదన్న సంకేతాలు జనంలోకి వెళ్లాయి. ఐసీయూలో ఉన్నది చలసాని కాదు... తెలుగుదేశం, ఆ పార్టీ నడుపుతున్న ప్రభుత్వం అని ఏబీవీ సంచలన ట్వీట్ చేశారు. అలాగే టీడీపీ అనుకూల మీడియా ప్రతినిధులు కూడా ఇదే రీతిలో తప్పు పడుతూ విశ్లేషణలు చేశారు. ఎక్కడైనా అక్రమాలకు పాల్పడితే రాజీనామా కోరడం ఆనవాయితీ. అలా కాకుండా సంస్థను లాభాల బాటలో నడిపిస్తూ, వేలాది రైతు కుటుంబాలకు ప్రయోజనం కలిగించేలా మంచి పాలన అందిస్తున్నారనే పేరు తెచ్చుకున్న చలసాని ఆంజనేయులు రాజీనామా చేసే వరకూ విడిచి పెట్టలేదంటే, టీడీపీ పెద్దల ఆలోచన విధానం ఏ రీతిలో సాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ, పార్టీ నిరంకుశ విధానానికి ఇంతకంటే ఉదాహరణ అవసరం లేదు. చలసాని ఆంజనేయులు రాజకీయంగా వైసీపీ కాదు. ఆయన కరడుగట్టిన టీడీపీ. గత ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం శ్రమించారు. వైసీపీ పాలనలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆయన విజయా డెయిరీ చైర్మన్‌గా కొనసాగి, మంచి నిర్ణయాలు తీసుకున్నారు. కానీ ఇప్పుడు మనది అని భావించే ప్రభుత్వంలో చలసాని పదవి పోగొట్టుకోవడం చిన్న విషయం కాదు. దీని వెనుక పెద్ద వారి సంస్థ ఆర్థిక ప్రయోజనాలు దాగి వున్నాయనే విమర్శల్ని కొట్టి పారేయలేం. ఆ కారణం లేకపోతే, ఆస్పత్రిలో ఉన్నా, విడిచి పెట్టకుండా, బలవంతాన రాజీనామాను ఎందుకు తీసుకుంటారనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి వుంటుంది. విమర్శలు చెలరేగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ పరిణామాలు టీడీపీ అభిమానుల్ని తీవ్ర ఆవేదన, ఆగ్రహానికి గురి చేస్తున్నాయి. గతంలో ఎప్పుడూ టీడీపీలో ఇలాంటి అప్రజాస్వామిక ధోరణుల్ని చూడలేదని టీడీపీ నాయకులు వాపోతున్నారు. ఇంత వరకూ వైసీపీని దుర్మార్గ పార్టీగా చంద్రబాబు, లోకేశ్, ఇతర టీడీపీ నాయకులు విమర్శిస్తూ వచ్చారు. అయితే ఇటీవల కొన్ని పరిణామాలతో టీడీపీ,



వైసీపీకి తేడా ఏమీ లేదన్న దుస్థితికి తీసుకొచ్చారు. కూటమి రెండేళ్ల పాలన సాధించిన విజయమో, అపజయమో ఏదంటే... కాస్త వైసీపీనే నయం అని జనం అనుకునే వరకూ తెచ్చుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో భారీ అవినీతి, అలాగే ఎన్ని విమర్శలు వచ్చినా , కేవలం రెండుమూడు కంపెనీలకే వర్క్‌లన్నీ ఇవ్వడం కూడా టీడీపీకి చెడ్డపేరు తెస్తోంది. ఇక శాంతిభద్రతల విషయంలో ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. పూర్తిగా గాలికి వదిలేశారు. జాతీయ స్థాయిలో ఏపీకి 26వ స్థానం వచ్చిందంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవచ్చు. కేవలం అధికారాన్ని అడ్డం పెట్టుకుని, వేల కోట్ల సంపాదనను వెనకేసుకుందామన్న అత్యుత్సాహంలో, పరిపాలనను గాలికి వదిలేశారన్న విమర్శ వుంది. ప్రభుత్వ పెద్దలు మొదలుకుని, మంత్రులు, ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకుల వరకూ భారీగా దోపిడీకి పాల్పడుతున్నారన్న తీవ్ర విమర్శలను పాలకులు పరిగణలోకి తీసుకోవాలి. లేదంటే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుంది. ఏపీలో పరిణామాలపై కూటమి శ్రేణుల్లో తీవ్ర ఆవేదన వుంది. ఇది తమ ఇష్టమైన నాయకుడు చంద్రబాబు మార్క్ పరిపాలన కాదని అంటున్నారు. మరెవరో పార్టీని, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారనే ఆవేదన కార్యకర్తల్లో వుంది. మంచి పరిపాలన అందించకపోవడం వల్లే, కేవలం రెండేళ్లలోనే పార్టీ, ప్రభుత్వం ఐసీయూలో వుందని బాగా అభిమానించే వారే ట్వీట్లు చేసే పరిస్థితి వచ్చిందని అంటున్నారు. కార్యకర్తల ఆవేదనలో నిజమెంత? అసలు ఏం జరుగుతున్నదో ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాలని అనుకుంటే, పెద్ద కష్టమేమీ కాదు. కానీ విమర్శల్ని పట్టించుకోకుండా, తాము అనుకున్నది మాత్రమే చేసుకెళ్లడానికి పాలకులు నిర్ణయించుకున్నట్టుగా, వారి తీరు చూస్తే తెలుస్తోంది. కానీ ప్రభుత్వాన్ని నడిపే నాయకుడు, అలాగే పార్టీపై విమర్శలు మాత్రం అలాగే ఉన్నాయి. అవి మరింత పెరుగుతూ, అభిమానుల్లో విరక్తిని, ప్రత్యర్థుల్లో మనదే ప్రభుత్వమనే జోష్‌ను పెంచుతున్నాయి. ఎక్కడేం జరుగుతున్నదో డాష్ బోర్డు ద్వారా నిమిషాల్లో తెలుసుకుంటాననే చంద్రబాబు, తన పాలనపై ముఖ్యంగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఏమనుకుంటున్నారో పసిగడితే మంచిది.

# టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ పేర్లపై విద్యాశాఖ నిఘా

హైదరాబాద్, మీరుండే ఏరియాలోనో, ఊర్లోనో ఉండే ప్రైవేటు స్కూల్స్ పేర్లను ఎప్పుడైనా గమనించారా..? కచ్చితంగా ప్రైవేట్ స్కూల్ పేర్లలో ఇంటర్నేషనల్, టెక్నో, ఒలింపియాడ్, టాలెంట్ వంటి పదాలు కనిపిస్తాయి. అయితే అటువంటి పదాలను స్కూల్ నేమ్ బోర్డులో వాడొద్దనే రూల్ ఉందనే విషయం తెలుసా..? అటువంటి పేర్లు ఉపయోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం 2009లో జారీ చేసిన జీవో నెం.91 స్పష్టంగా పేర్కొన్నప్పటికీ.. చాలా జిల్లాల్లో ఇప్పటికీ వందలాది పాఠశాలలు ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నట్లు తేలింది. ప్రభుత్వం నిషేధించిన ఈ పేర్లను కొనసాగిస్తూ కొన్ని విద్యాసంస్థలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ అధికారిక డేటాబేస్ ఆధారంగా నిర్వహించిన విశ్లేషణ ప్రకారం.. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని మొత్తం 3,697 పాఠశాలల్లో కనీసం 601 స్కూల్స్ అంటే దాదాపు 16.3 శాతం విద్యాసంస్థలు, నిషేధిత పదాల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పదాలను తమ పేర్లలో కొనసాగిస్తున్నాయని తేలింది. వీటిలో అత్యధికంగా మోడల్ అనే పదం 210 పాఠశాలల పేర్లలో ఉండగా.. టాలెంట్ 73, ఇంటర్నేషనల్ 72 పాఠశాలల పేర్లలో కనిపించింది. అదనంగా కాన్సెప్ట్, ఎక్సలెన్స్, బ్రిలియంట్, క్రియేటివ్ వంటి పదాలు కూడా విస్తృతంగా వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. 2009లో జారీ చేసిన జీవో-91 ప్రకారం.. ఇటువంటి పేర్లు పాఠశాలలు పెట్టుకుంటే ఇతర సంస్థల కంటే మెరుగైన విద్య అందిస్తున్నాయనే తప్పుడు అభిప్రాయాన్ని తల్లిదండ్రుల్లో కలిగిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ పేర్లను ఆధారంగా చేసుకుని అధిక ఫీజులు వసూలు చేసే అవకాశం ఉందన్న కారణంతో ఈ నిబంధన తీసుకొచ్చారు. అయినప్పటికీ దాదాపు 17 సంవత్సరాలు గడిచినా ఆ ఉత్తర్వుల అమలు పూర్తిస్థాయిలో జరగలేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. విద్యావేత్తలు ఈ ధోరణిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా పేర్లు విద్యా నాణ్యతకు కొలమానం కావని, కేవలం తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ఉపయోగించే మార్కెటింగ్ వ్యూహాలేనని మాజీ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ శాంతా సిన్హా పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్య కూడా ఒక వస్తువులా మారిపోయిందని, పిల్లలకు మంచి విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షను కొందరు విద్యాసంస్థలు బ్రాండింగ్ ద్వారా వినియోగించుకుంటున్నారని ఆమె వ్యాఖ్యానించారు. తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై శేఖర్ రావు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్నేషనల్, మోడల్, టెక్నో వంటి పదాలను చూసి చాలా మంది తల్లిదండ్రులు ఆ పాఠశాలలు మెరుగైన విద్య అందిస్తాయని భావిస్తున్నారని, కొందరు యాజమాన్యాలు ఈ అభిప్రాయాన్ని మార్కెటింగ్ సాధనంగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందని, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఈ విషయంపై హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య స్పందిస్తూ.. రెండు సంవత్సరాల క్రితం నిబంధనలను ఉల్లంఘించిన పలు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత కొన్ని విద్యాసంస్థలు తమ పేర్లను మార్చుకున్నాయని..ప్రస్తుతం కొత్తగా గుర్తింపు కోసం వచ్చే పాఠశాలలకు నిషేధిత పదాలతో పేర్లకు అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా, కొందరు తల్లిదండ్రులు కూడా పాఠశాల పేర్లు తమ నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయని అంగీకరిస్తున్నారు. ఇంటర్నేషనల్, టెక్నో వంటి పదాలు కనిపిస్తే అక్కడ మెరుగైన పాఠ్యాంశాలు, ఆధునిక సౌకర్యాలు ఉంటాయని చాలామంది భావిస్తారని చెబుతున్నారు. మరోవైపు ప్రైవేటు స్కూల్స్ యాజమాన్య సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రాజు మాత్రం కేంబ్రిడ్జ్ లేదా ఐబీ సిలబస్ బోధించే పాఠశాలలు ఇంటర్నేషనల్ అనే పదాన్ని ఉపయోగించడంలో తప్పు లేదని అభిప్రాయపడ్డారు. అయితే కేవలం పేరు ఆధారంగా కాకుండా పాఠశాల బోధనా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల నాణ్యత, విద్యార్థుల ఫలితాలు వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

# వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా

కాకినాడ,వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పధ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు. కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు

# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ

కాకినాడ,ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్దేశిత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి–రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది.సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మిడివరపుపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం–ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీవన్న ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు–తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఇన్ను డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్డు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# రైతుల పంట విరామం

ఏలూరు, ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్చని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రెయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు.అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు. మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

నంధ్యాల,ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 43,580 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ఔట్ ఫ్లో 4,600 క్యూసెక్కులుగా నమోదైంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 878.60 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పరిధిలోని కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, ఎడమ జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేశారు.

# కోర్టు ధిక్కరణ కేసులు 5వేలపైనే...



హైదరాబాద్,రాష్ట్రంలో కోర్టు ధిక్కరణ కేసులు అధికారులకు తలనొప్పిగా మారుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు, పరిపాలనా ప్రక్రియల్లో జాప్యం, నిధుల కొరత, ఫైళ్ల కదలికలో ఆలస్యం, వివిధ స్థాయిల్లో అనుమతులు పెండింగ్‌లో ఉండటం వంటి కారణాలతో న్యాయస్థానాల ఆదేశాలు సకాలంలో అమలు కావడం లేదు. దీంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతుండగా.. సంబంధిత శాఖల అధికారులు వ్యక్తిగతంగా న్యాయస్థానాల ఎదుట హాజరై వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం రాష్ట్రంలోని వివిధ శాఖలకు సంబంధించి 5వేలకుపైగా కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో 2 వేలకుపైగా కేసులు ఒక్క ఆర్థికశాఖపైనే ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం మారినా పరిస్థితిలో మాత్రం పెద్దగా మార్పు కనిపించడం లేదన్న అభిప్రాయం పరిపాలనా వర్గాల్లో వ్యక్తమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులు ఇంకా కొనసాగుతుండగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ కొత్తగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలవుతున్నాయి. దీంతో కోర్టు ఉత్తర్వుల అమలులో జాప్యం అనే సమస్య ఏ ఒక్క ప్రభుత్వానికో, శాఖకో పరిమితం కాకుండా మొత్తం పరిపాలనా వ్యవస్థను వేధిస్తున్న అంశంగా మారింది.

### సుల్తానియాపై వ్యాఖ్యలతో కలకలం

సీనియర్ ఐఏఎస్ అధికారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు సంబంధించిన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ యంత్రాంగంలో తీవ్ర చర్చకు దారితీశాయి. జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ సందర్భంగా.. సుల్తానియాపై నమోదైన అన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లలో శిక్ష పడితే జీవితాంతం జైలులోనే ఉండాల్సి వస్తుందన్న వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, పరిపాలనా ప్రక్రియల్లో జరిగే జాప్యాల ప్రభావం చివరకు అధికారులపై పడుతున్న తీరును ఈ వ్యాఖ్యలు మరోసారి తెరపైకి తెచ్చాయి.

### రంగనాథ్‌పై 63 కేసులు

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారంలోనూ ఇటీవల హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఏడాదిన్నర కాలంలో ఆయన ఒక్కరిపైనే 63 కోర్టు ధిక్కరణ కేసులు నమోదైనట్లు హైకోర్టు వెల్లడించింది. వరుసగా ధిక్కరణ పిటిషన్లు దాఖలవుతుండటం, అధికారులను వ్యక్తిగతంగా హాజరుకావాలని న్యాయస్థానాలు ఆదేశిస్తుండటం ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కోర్టు ధిక్కరణ కేసుల సమస్య ప్రస్తుత ప్రభుత్వంతోనే మొదలైంది కాదు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఉద్యోగ నియామకాలు, భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ప్రభుత్వ బిల్లుల బకాయిలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై పెద్ద సంఖ్యలో కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదయ్యాయి. పలువురు ఐఏఎస్ అధికారులు అప్పట్లోనూ హైకోర్టు ఎదుట వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం మారినా.. కోర్టు ఉత్తర్వుల అమలులో జాప్యం మాత్రం కొనసాగుతున్నదన్న అభిప్రాయం బలపడుతోంది.

### జాప్యానికి కారణాలెన్నో

కోర్టు ఆదేశాలను నిర్దేశిత గడువులోగా అమలు చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. నిధుల కొరత, ఫైళ్ల కదలికలో జాప్యం, ప్రభుత్వ స్థాయి అనుమతులు ఆలస్యం కావడం, విధానపరమైన నిర్ణయాలు పెండింగ్‌లో ఉండటం వంటి కారణాలతో కోర్టు ఉత్తర్వుల అమలులో జాప్యం జరుగుతోంది. ఫలితంగా కోర్టుకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాత్రం సంబంధిత అధికారులపైనే పడుతోంది.సుల్తానియా కేసు విచారణ సందర్భంగా కూడా ఇదే అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయాలు, పరిపాలనా ప్రక్రియల్లో చోటుచేసుకునే జాప్యాల కారణంగా అధికారులు కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎదుర్కోవాల్సి వస్తోందన్న వ్యాఖ్యలు ఈ సమస్య తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి.

### నిర్ణయం ప్రభుత్వానిది.. బాధ్యత అధికారులదా?

విధానపరమైన నిర్ణయాలు తీసుకునేది ప్రభుత్వం. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంటుంది. అయితే ఆ నిర్ణయాల అమలులో జాప్యం జరిగితే కోర్టు ముందు నిలబడాల్సి వచ్చేది సంబంధిత అధికారులే. దీంతో విధాన నిర్ణయాలు తీసుకునేది ప్రభుత్వం అయినప్పుడు.. కోర్టు ధిక్కరణ కేసుల్లో అధికారులు మాత్రమే ఎందుకు బాధ్యత వహించాలి? అనే ప్రశ్న పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆర్థిక, రెవెన్యూ, మున్సిపల్ పరిపాలన, విద్య, పంచాయతీరాజ్ తదితర శాఖలపై పెద్ద సంఖ్యలో కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసులకు తోడు కొత్త కేసులు కూడా వరుసగా నమోదవుతుండటంతో సంబంధిత అధికారులపై పని ఒత్తిడి మరింత పెరుగుతోంది.

### కోర్టుల కఠిన వైఖరి

మరోవైపు కోర్టు ఉత్తర్వుల అమలుపై న్యాయస్థానాలు మరింత కఠినంగా వ్యవహరిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అధికారులను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించడం, వివరణలు కోరడం, అవసరమైన సందర్భాల్లో బెయిలబుల్ వారెంట్లు జారీ చేయడం, కోర్టు ధిక్కరణ కేసుల విచారణను వేగవంతం చేయడం వంటి చర్యలు ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్నాయి. కోర్టు ఉత్తర్వులు వెలువడిన తర్వాత వాటిని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని న్యాయస్థానాలు పదేపదే స్పష్టం చేస్తున్నాయి. కోర్టు ధిక్కరణ కేసుల పెరుగుదల ఒక అధికారి లేదా ఒక శాఖకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది మొత్తం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ పనితీరును ప్రతిబింబిస్తోందని చెబుతున్నారు.ఒకవైపు విధాన నిర్ణయాలు తీసుకునే రాజకీయ ప్రభుత్వం.. మరోవైపు వాటిని అమలు చేసే అధికార యంత్రాంగం.. మధ్యలో న్యాయస్థానాల ఆదేశాలు.. ఈ మూడు వ్యవస్థల మధ్య సమన్వయం లోపిస్తే కోర్టు ధిక్కరణ కేసులు పెరగడం సహజమేనని పేర్కొంటున్నారు. నిధుల కొరత, పరిపాలనా ప్రక్రియలు, విధానపరమైన నిర్ణయాల్లో జాప్యం వంటి కారణాలతో కొన్నిసార్లు కోర్టు ఆదేశాల అమలులో ఆలస్యం జరుగుతోందని ప్రభుత్వం వివరిస్తోంది. అయితే న్యాయస్థానం ఉత్తర్వులు వెలువడిన తర్వాత వాటిని సకాలంలో అమలు చేయడం తప్పనిసరి. అందువల్ల ప్రభుత్వం, ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల మధ్య మెరుగైన సమన్వయం ఏర్పాటు చేసి.. కోర్టు ఆదేశాల అమలును నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### ఏం చేస్తారనేదే కీలకం

కోర్టు ఆదేశాలు నిర్దేశిత సమయంలో అమలైతే ధిక్కరణ కేసులకు ఆస్కారం ఉండదు. వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పరిపాలనా స్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు కీలకంగా మారింది. అధికారులను కోర్టు ధిక్కరణ కేసుల నుంచి కాపాడడంతో పాటు న్యాయస్థానాల ఆదేశాలు

# నిరసనల అణచివేతే పరిష్కారమా?

హైదరాబాద్,ప్రజల సమస్య నిజమైనదైతే, నాయకత్వం విశ్వసనీయమైతే, ఉద్యమం మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్యంలో సంభాషణ, సంప్రదింపులు, పారదర్శకత అత్యంత అవసరం. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా పరిష్కార దిశగా తీసుకెళ్లాలి. నిరసనలను కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అలాగే ప్రభుత్వం ప్రతి విమర్శను దేశద్రోహంగా, విదేశీ కుట్రగా చిత్రీకరించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతికి హానికరం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు వచ్చిన ప్రతి ఉద్యమం ఒకే సందేశాన్ని ఇస్తోంది.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాగొంతుకకు అత్యంత శక్తివంతమైన ఆయుధం నిరసన. ఓటు వేసిన తర్వాత కూడా ప్రజలు తమ అసంతృప్తిని, బాధను, డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించే రాజ్యాంగబద్ధమైన మార్గమే శాంతియుత ఆందోళన. అయితే భారత రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఒకే ధోరణి కనిపిస్తుంది. అది నిరసనలను వినడం కంటే వాటిని కాలయాపనతో బలహీనపరచడం. చివరికి ఉద్యమం అలసిపోతుందని, ప్రజలు చెదిరిపోతారని, నాయకత్వం నీరుగారుతుందని అధికార యంత్రాంగం భావిస్తుంది. ఇదే అంశాన్ని ఇటీవల సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్ష, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది.భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిరసనలను ఎదుర్కొన్న ప్రభుత్వాల వైఖరిలో పెద్దగా మార్పు కనిపించదు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా, ప్రజల ఆందోళనలను తక్షణమే పరిష్కరించేందుకు ముందుకు రావడం కంటే వాటిని చట్టపరమైన చర్యలు, పరిపాలనా నియంత్రణలతో ఎదుర్కొనే ధోరణే ఎక్కువగా కనిపించింది. మణిపూర్‌కు చెందిన ఐరమ్ షర్మిలా పదహారేళ్ల పాటు సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్ఎస్‌పిఎ) రద్దు కోసం నిరాహార దీక్ష చేసినా, ఆమె డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోలేదు. అరెస్టులు, బలవంతపు ఆహార సరఫరా వంటి చర్యలతో ఉద్యమాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించింది.నేడు లడఖ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం సందర్భంలోనూ ప్రభుత్వ స్పందనపై ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో విభేదాలను అణచివేయడమే ప్రభుత్వ బాధ్యతా? లేక ప్రజలతో సంభాషించి వారి ఆందోళనల సారాంశాన్ని అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను అన్వేషించడమా? అనే మౌలిక ప్రశ్న మరోసారి జాతీయ చర్చకు కేంద్రబిందువైంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలప్రయోగంతో కాదు, పరస్పర విశ్వాసం, సంభాషణ, రాజ్యాంగబద్ధమైన చర్చలతోనే మరింత బలపడుతుందనే విషయాన్ని ఈ పరిణామాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి.ప్రభుత్వం దృష్టిలో చట్టవ్యవస్థ, శాంతిభద్రతలు కాపాడటం బాధ్యత. కానీ అదే సమయంలో శాంతియుత నిరసన హక్కును కూడా గౌరవించాల్సిన బాధ్యత ఉంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత కోల్పోయినప్పుడు ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ఉద్యమాలను బలప్రయోగంతో అణచివేయడం తాత్కాలికంగా ఫలితాన్నివ్వొచ్చు. కానీ ప్రజల



మనసుల్లో అసంతృప్తి మరింత పెంచుతుంది. భారత రాజకీయ చరిత్రలో రైతు ఉద్యమం దీనికి పెద్ద ఉదాహరణ. మొదట కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని పెద్దగా పట్టించుకోలేదు. కాలక్రమేణా ఉద్యమం బలపడింది. ఏడాది పాటు కొనసాగిన ఆందోళన తర్వాత చివరకు మూడు వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అంటే ప్రజాస్వామ్యంలో దీర్ఘకాలిక, శాంతియుత ఉద్యమాలకు ప్రభావం ఉంటుందని చరిత్ర చెబుతోంది. అయితే మరో కోణాన్ని కూడా విస్మరించలేం. ప్రతి నిరసన సమంజసమేనా? ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే అంగీకరించాలా? అనే ప్రశ్నలు కూడా ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని వినాలి. అదే సమయంలో విధాన నిర్ణయాలను చట్టపరమైన, రాజ్యాంగబద్ధమైన ప్రక్రియల ద్వారా తీసుకోవాలి. కాబట్టి సంభాషణే సరైన మార్గం. నిర్లక్ష్యం కాదు, అణచివేత కాదు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల్లో ఒక ముఖ్యమైన అంశం సోషల్ మీడియా ప్రభావం. ఒకప్పుడు ఉద్యమం స్థానికంగా ఉండేది. ఇప్పుడు నిమిషాల్లో దేశవ్యాప్తంగా వ్యాపిస్తోంది. వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు, ప్రజల స్పందన ఉద్యమానికి కొత్త శక్తిని ఇస్తున్నాయి. అందువల్ల కేవలం పోలీసు చర్యలతో ఉద్యమాన్ని ఆపేయడం గతంలో కంటే కష్టమైంది.ప్రభుత్వాలు సాధారణంగా 'సమయం గడిస్తే ఉద్యమం చల్లారిపోతుంది' అనే వ్యూహాన్ని అనుసరిస్తుంటాయి. కానీ అది ఎప్పుడూ పనిచేయదు. ప్రజల సమస్య నిజమైనదైతే, నాయకత్వం విశ్వసనీయమైతే, ఉద్యమం మరింత బలపడే అవకాశమూ ఉంటుంది. అందుకే ప్రజాస్వామ్యంలో సంభాషణ, సంప్రదింపులు, పారదర్శకత అత్యంత అవసరం. ఇక్కడ ప్రతిపక్షాల బాధ్యత కూడా తక్కువ కాదు. ప్రజా సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా పరిష్కార దిశగా తీసుకెళ్లాలి. నిరసనలను కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచార వేదికగా మార్చడం కూడా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. అలాగే ప్రభుత్వం ప్రతి విమర్శను దేశద్రోహంగా, విదేశీ కుట్రగా చిత్రీకరించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతికి హానికరం. ఐరమ్ షర్మిలా నుంచి సోనమ్ వాంగ్‌చుక్ వరకు వచ్చిన ప్రతి ఉద్యమం ఒకే సందేశాన్ని ఇస్తోంది. అధికారాలు శాశ్వతం కావు. కానీ ప్రజల ఆకాంక్షలు శాశ్వతం. నిరసనలను అణచివేయడం ద్వారా సమస్యలు ముగియవు. వాటిని వినడం, అర్థం చేసుకోవడం, పరిష్కారం చూపడం ద్వారానే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

# ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్

ఒంగోలు, ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు.ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

# 12 వేల 500 కోట్ల కలెక్షన్స్ తో స్పైడర్ మ్యాన్

ముంబై,హాలీవుడ్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్ : బ్రాండ్ న్యూ డే' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. జులై 30న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా వీక్ డేస్‌లోనే సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకూ వరల్డ్ వైడ్‌గా వి1.31 బిలియన్ డాలర్లకు (ఇండియన్ కరెన్సీలో రూ.12,300 కోట్లకు పైగా కలెక్షన్స్) పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ఇండియాలో ఇప్పటివరకూ రూ.400 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ ఓటీటీపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.థియేట్రికల్ రన్ తర్వాత స్పైడర్ మ్యాన్ లేటెస్ట్ మూవీ ఇంటర్నేషనల్ ఓటీటీ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు సహా ఇతర భాషల్లోనూ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. సెప్టెంబర్ లాస్ట్ వీక్ లేదా అక్టోబర్ సెకండ్ వీక్‌లో ఓటీటీలో స్ట్రీమ్ అయ్యే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం 'స్పైడర్ మ్యాన్ : నో వే హోమ్' జియో హాట్ స్టార్‌లో అందుబాటులో ఉంది. లేటెస్ట్ మూవీ ఈ ఓటీటీలోనూ వచ్చే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది.ఈ మూవీకి డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహించగా... టామ్ హాలండ్ స్పైడర్ మ్యాన్‌గా నటించాడు. అతనికి జోడీగా జెండయా నటించారు. జాకబ్ బాటలన్, సాడీ సింక్, జాన్ బెర్నాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో తదితరులు కీలకపాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్స్ ఇండియా బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మించారు.పీటర్ పార్కర్ (టామ్ హాలండ్) ఎవరనేది ప్రపంచం మర్చిపోవడంతో స్నేహితులు, ప్రియురాలు అందరికీ దూరంగా ఉంటూ ఒంటరి జీవితాన్ని గడుపుతుంటాడు. న్యూయార్క్‌లో జరగబోయే నేరాలను తన ట్రాకింగ్ సిస్టమ్‌తో ముందే పసిగట్టి వాటిని అడ్డుకుంటూ నేరస్థులను చట్టానికి అప్పగిస్తూ... ఓ ఫ్రెండ్లీ స్పైడర్ మ్యాన్‌గా వ్యవహరిస్తుంటాడు. సరిగ్గా అదే టైంలో స్పైడర్ మ్యాన్ శరీరంలో ఊహించని మార్పులు జరుగుతుంటాయి.హార్మోన్ల ప్రతిస్పందన తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతూ ఉంటాడు. మరోవైపు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ డ్యామేజ్ కంట్రోల్‌పై ఓ అదృశ్య శక్తి దాడులు చేస్తూ వీ మ్యాక్స్ కోసం వెతుకుతూ ఉంటుంది. అసలు డీసీసీపై దాడి చేస్తున్న ఆ అదృశ్య శక్తి ఏంటి? వి మ్యాక్స్ అంటే ఏంటి? ఆ శక్తిని ఎదుర్కొనేందుకు స్పైడర్ మ్యాన్ ఏం చేశాడు? ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లేంటి? తన ప్రియురాలికి పీటర్ పార్కర్ ఎలా గుర్తొచ్చాడు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

# మళ్లీ జలజగడం...

హైదరాబాద్, తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి.

# ఆలీ రాజకీయాలు ఎందుకు వదిలేశాడు?



గుంటూరు, తెలుగు సినిమా నటులు రాజకీయాలు చేయడం ఎప్పట్నుంచో ఉన్నదే. కానీ ఈ మధ్య పరిస్థితులు మారిపోయాయి. సినిమాలు వేరు, రాజకీయాలు వేరు అని చూడట్లేదు జనం. సినిమా వాళ్లు రాజకీయాల్లోకి వస్తే.. ఆ ప్రభావం వారి సినిమాల మీదా పడుతోంది. ఇలా కెరీర్‌ను దెబ్బ తీసుకున్న వాళ్లలో ఆలీ కూడా ఒకరు. ఆయన చాలా ఏళ్ల పాటు తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. తర్వాత తన మిత్రుడు పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేనలోకి వస్తారని అనుకుంటే.. అనూహ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. వైసీపీ గెలిచాక ఒక పదవిలో ఉన్న ఆయన.. ఆ పార్టీ ఓడిపోయాక రాజకీయాల నుంచి వైదొలిగారు. ఇకపై మళ్లీ రాజకీయాల్లోకి వచ్చేదే లేదంటున్నారు. మరి రాజకీయా పట్ల ఎందుకు విముఖత పెంచుకున్నారు అని ఒక ఇంటర్వ్యూలో అడిగితే.. ఆలీ సమాధానం చెప్పారు. తాను మొదట పనిచేసిన పార్టీ పట్ల తన అసంతృప్తిని బయటపెట్టుకున్నారు. రాజకీయాల వల్ల సినిమా కెరీర్ దెబ్బ తిన్న విషయాన్ని అంగీకరించారు. 'నేనెప్పుడూ రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదు. 1999లో ఒక పార్టీ వాళ్లు నన్ను తీసుకెళ్లి ఆ పార్టీ కండువా కప్పారు. దాదాపు 20 ఏళ్ల పాటు ఆ పార్టీలో ఉన్నాను. ఐతే నాకు ఎలాంటి గుర్తింపు లభించలేదు. కేవలం ఐదేళ్లకోసారి ఎన్నికలు వచ్చినపుడు నన్ను ఉపయోగించుకోవడం, తర్వాత వదిలేయడం.. ఇదే జరిగింది. మనల్ని వాళ్లు గుర్తించనపుడు, మనల్ని అవసరానికి వాడుకుని వదిలేస్తున్నపుడు మన సమయాన్ని వాళ్ల కోసం ఎందుకు వేస్ట్ చేయడం అనిపించింది. సినిమాలను పక్కన పెట్టి, టైం పెట్టి ఇలా కష్టపడడం ఎందుకు అనిపించింది. అందుకే ఆ పార్టీ నుంచి పక్కకు వచ్చేశాను. తర్వాత ఇంకో పార్టీలోకి వెళ్లాను. అక్కడా పని చేశాను. మళ్లీ అది కూడా వద్దనిపించింది. మనకు తిండి పెట్టింది, ఇంతవాడిని చేసింది సినిమా. రాజకీయాల కోసం సినిమాలను ఎందుకు వదులుకోవాలి. ఈ కెరీర్‌ను ఎందుకు దెబ్బ తీసుకోవాలి అనిపించింది. అందుకే రాజకీయాల నుంచి పూర్తిగా బయటికి వచ్చేశాను. ఇకపై మళ్లీ ఆ రంగంలోకి వెళ్లను" అని ఆలీ తేల్చి చెప్పాడు.

రప్పా..రప్పా మిస్సింగ్

వైసీపీ అధినేత జగన్ పర్యటనల్లో భాగంగా ఇటీవల కాలంలో 'రప్పా-రప్పా' డైలాగులు తరచుగా వినిపించేవి. రప్పా-రప్పా అని రాసున్న బ్యానర్లు, ప్లకార్డులు కూడా దర్శనమిచ్చాయి. అయితే.. ఇవి సమాజాన్ని రెచ్చగొట్టేలా ఉండడం.. రౌడీయిజాన్ని పెంచేలా ఉండడంతో పోలీసులు ఈ వ్యాఖ్యలు సహా.. ఈ బ్యానర్లను కట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో ఇటీవలి జగన్ పర్యటనల్లో రప్పా-రప్పా బ్యానర్లు మాయమయ్యాయి. వీటి స్థానంలో కొత్తవి చోటు చేసుకున్నాయి.ఇటీవల వైసీపీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు జగన్ శ్రీకాకుళం వెళ్లారు. ఈ సమయంలో కూడా రప్పా-రప్పా బ్యానర్లు కనిపించలేదు. యువత కూడా.. రప్పా-రప్పా అని రాసున్న ప్లకార్డులను ప్రదర్శించలేదు. ఇక, తాజాగా బుధవారం మాజీ సీఎం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పర్యటించారు. పొగాకు రైతులకు మద్దతు ధరలు రావడం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ.. రైతులను పరామర్శించేందుకు తాడేపల్లి నుంచి ఆయన దేవరపల్లికి చేరుకున్నారు.ఈ సమయంలో భారీగా కార్యకర్తలు, మహిళలు జగన్ పర్యటనకు వచ్చారు. ఈ సమయంలో రప్పా-రప్పా బ్యానర్ల స్థానంలో వినూత్నంగా బ్యానర్లు కనిపించాయి. "నువ్వే మా రారాజు. నువ్వే మా దేవుడు. నీతోనే మేం నడుస్తాం." అని రాసున్న ప్లకార్డులను పలువురు మహిళలు, యువత కూడా ప్రదర్శించారు. మరోవైపు.. పోలీసులు గట్టి భద్రతను కల్పించారు. తొలుత అనుమతి లేదని చెప్పినా.. చివరి నిమిషంలో అనుమతి ఇచ్చారు. నేరుగా దేవరపల్లికి హెలికాప్టర్‌లో వెళ్లిన జగన్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు.ఈ సమయంలో పెద్ద ఎత్తున చేరుకున్న కార్యకర్తలు.. జగన్ దేవుడంటూ.. కొనియాడారు. ఆయన పాలన తిరిగి వస్తుందని రాసి ఉన్న బ్యానర్లు పట్టుకుని కనిపించారు. అయితే.. మరోవైపు రప్పా-రప్పా అని రాసి ఉన్న ప్లకార్డులు కానీ, బ్యానర్లు కానీ కనిపిస్తాయేమోనని పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ బ్యానర్లు, ప్లకార్డులు కనిపిస్తే.. సదరు వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక టీంను రంగంలోకి దింపారు. కానీ .. పోలీసుల ఎఫెక్ట్‌తో రప్పా-రప్పా బ్యానర్లు కనిపించకపోవడం గమనార్హం.

# హైదరాబాద్ ట్రాఫిక్,అధిక ఉష్ణోగ్రతలు..



హైదరాబాద్, ఆగస్టు 11,హైదరాబాద్‌వాసులకు ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కొత్త సమస్యగా మారాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్ నగర ప్రజలు ఈ రెండు సమస్యలతో ఏటా 200 గంటలు నష్టపోతున్నారని తేలింది. ట్రాఫిక్ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతుండగా.. రాత్రి అధిక ఉష్ణోగ్రతల కారణంగా మరో 75 గంటల నిద్రను కోల్పోతున్నారని వెల్లడైంది. ఇక హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా ఉన్నట్లు తేల్చింది. వాహనాల పెరుగుదల, రహదారుల కొరత, ప్రజా రవాణా సామర్థ్యం, వాతావరణ మార్పులు ఈ సమస్యలకు ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు.హైదరాబాద్‌లో జీవనం రోజురోజుకూ వేగంగా మారుతున్నా.. నగరవాసులు మాత్రం భారీగా సమయాన్ని నష్టపోతున్నారు. ఒకవైపు రోడ్లపై పెరుగుతున్న ట్రాఫిక్ గంటల కొద్దీ సమయాన్ని మింగేస్తుండగా.. మరోవైపు రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు నగరవాసులకు నిద్రను దూరం చేస్తున్నాయి. తాజా అధ్యయనాల ప్రకారం హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్ రద్దీ, వేడి రాత్రుల కారణంగా ఏడాదికి దాదాపు 200 గంటల సమయాన్ని కోల్పోతున్నారని వెల్లడైంది. అంటే ప్రతీ సంవత్సరం 8 రోజులకు పైగా సమయం హైదరాబాద్ నగర జీవన పరిస్థితుల కారణంగా వృథా అవుతున్నట్టేనని తేలింది.టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ తాజా రిపోర్ట్ ప్రకారం హైదరాబాద్‌లో ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ కారణంగా ఏడాదికి సుమారు 123 గంటలు కోల్పోతున్నారని తేలింది. ఇది 5 రోజులకు సమానం. నగరంలో ట్రాఫిక్ రద్దీ స్థాయి 55.5 శాతంగా నమోదైంది. సాధారణంగా 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి సగటున 32.37 నిమిషాలు పడుతుండగా.. సాయంత్రం రద్దీ వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అదే 10 కిలోమీటర్ల ప్రయాణానికి సగటున 39.5 నిమిషాలు పడుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది.హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య భారీగా పెరగడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. నగరంలో వాహనాల సంఖ్య దాదాపు 80 లక్షలకు చేరినట్లు ఒక అంచనా ఉంది. దీంతో గత దశాబ్దంలో వాహనాల సంఖ్య దాదాపు రెట్టింపు అయినప్పటికీ.. అందుకు అనుగుణంగా రహదారుల విస్తరణ, ప్రజా రవాణా సామర్థ్యం పెరగలేదని నిపుణులు పేర్కొంటున్నారు. మహానగరాల్లో ట్రాఫిక్ వేగం గంటకు 25 నుంచి 30 కిలోమీటర్ల మధ్య ఉండటం ఆదర్శంగా భావిస్తే.. హైదరాబాద్‌లో సగటు వేగం 15 కిలోమీటర్లకు మాత్రమే పరిమితమవుతోందని తేలింది. ఇక సాయంత్రం వేళ పీక్ అవర్స్‌లో ఇది 10 కిలోమీటర్లకు కూడా పడిపోతోందని రిటైర్డ్ ఇంజనీర్ టి సత్యనారాయణరెడ్డి తెలిపారు.హైదరాబాద్‌వాసులు సమయాన్ని కోల్పోవడం కేవలం రోడ్లపైనే ఆగిపోవడం లేదు. రాత్రివేళ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా నగరవాసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ సంస్థ 1,338 నగరాలపై నిర్వహించిన విశ్లేషణలో హైదరాబాద్‌లో అధిక రాత్రి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఏడాదికి సుమారు 75 గంటల నిద్రను కోల్పోతున్నట్లు తేల్చింది. ఇందులో సుమారు 7 గంటల నిద్ర నష్టానికి నేరుగా వాతావరణ మార్పులే కారణమని ఈ అధ్యయనం అంచనా వేసింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఏడాదికి సగటున 56 గంటల నిద్ర కోల్పోతుండగా.. హైదరాబాద్‌లో ఈ సంఖ్య 75 గంటలుగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2020 నుంచి 2025 వరకు ఉన్న డేటాను విశ్లేషించిన ఈ అధ్యయనం వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ భారతదేశంలోని ప్రజలు వేడి రాత్రుల కారణంగా ఏడాదికి 70 నుంచి 90 గంటల వరకు నిద్ర కోల్పోతున్నారని తేలింది.పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు పగటి వేడిని ఎక్కువగా గ్రహించి రాత్రివేళ నెమ్మదిగా విడుదల చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో సూర్యాస్తమయం అయిన తర్వాత కూడా నగరాల్లో ఉష్ణోగ్రతలు త్వరగా తగ్గకపోవడం వేడి సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. పని వేళలు, ఒత్తిడి, ఆరోగ్య పరిస్థితులు, కెఫైన్ వినియోగం, వెలుతురు, శబ్దం, బెడ్‌రూమ్ పరిస్థితులు, తేమ వంటి అనేక అంశాలు నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తాయని పేర్కొంటున్నారు. అయితే వాతావరణ మార్పులు, పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు కూడా ఇప్పుడు తగినంత నిద్రకు అడ్డంకులుగా మారుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. మొత్తంగా చూస్తే.. హైదరాబాద్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్, రాత్రివేళ వేడి కలిసి నగరవాసుల విలువైన సమయాన్ని, విశ్రాంతిని రెండింటినీ హరిస్తున్నాయని అర్థం అవుతోంది.

# టీపీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..

హైదరాబాద్,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు రాబోతున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అధికార వర్గం ఒకే వ్యక్తి చేతుల్లో అధికారం కేంద్రీకరించకుండా, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమతుల్యతను కాపాడుకోవాలని వ్యూహాత్మకంగా టీపీసీసీ అడుగులు వేస్తోంది.పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలోనే ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఏఐసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలనే ప్రతిపాదనకు అంతా ఓకే చెప్పారు. ఇది స్థానిక నాయకత్వం, కేంద్ర నాయకత్వం మధ్య సమన్వయంతో జరుగుతున్న ప్రక్రియను సూచిస్తుంది. కేవలం ఒక చీఫ్‌పైనే భారం పడకుండా, బహుళ నాయకత్వ నమూనాను అమలు చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బీసీ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడం ఈ నిర్ణయానికి మూలకారణం. ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయించకుండా, ఇతర సామాజిక వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకురావాలనే స్పష్టమైన ఆలోచన ఉంది. దీని ద్వారా పార్టీ లోపలి అసంతృప్తిని తగ్గించి, విస్తృత సామాజిక ఆధారాన్ని బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిపిస్తోంది.సామాజికవర్గాల వారీగా సముత్యం పాటిస్తు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక ఆమోదముద్రే తరువాయి అని తెలుస్తోంది. ఎంపిక చేసిన నలుగురు పేర్లను పీసీసీ జాతీయ నాయకత్వానికి పంపినట్లు సమాచారం. ఎంపిక చేసినవారిలో ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డికి అవకాశం దక్కనుంది.వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు



ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి కూడా చర్చనీయాంశమైంది. ఈ పదవికి జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ప్రచార వ్యూహాలు, సందేశాల రూపకల్ప నలో అనుభవం ఉన్న నాయకులను ముందుంచడం పార్టీ ప్రచార యంత్రాంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడవచ్చు.నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం టీపీసీసీని మరింత వికేంద్రీకృతంగా మార్చగలదు. ఒకే వ్యక్తి నిర్ణయాలపై ఆధారపడకుండా, వివిధ వర్గాలు, ప్రాంతాలు, సమస్యలపై సమాంతరంగా పని చేసే అవకాశం ఏర్పడుతుంది. అయితే, ఇలాంటి బహుళ నాయకత్వ నమూనా విజయవంతం కావాలంటే స్పష్టమైన బాధ్యతల పంపిణీ, సమన్వయం అవసరం. లేకపోతే అంతర్గత పోటీలు, సంకేతాల గందరగోళం ఏర్పడే అవకాశం కూడా ఉంది.తెలంగాణలో కాంగ్రెస్ తన సామాజిక ఆధారాన్ని విస్తృతం చేసుకోవాలని, అంతర్గత సమతుల్యతను కాపాడుకోవాలని టీపీసీసీ చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. తదుపరి నిర్ణయాలు ఎలా ఉంటాయో, ఎవరు కచ్చితంగా

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు పెద్ద దిక్కు..



ఎల్లారెడ్డిపేట: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్ని బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లబ్ధిదారుడికి ఆర్థిక సహాయం అందజేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మండల కేంద్రానికి చెందిన ఆమీర్‌కు వైద్యం నిమిత్తం మంజూరైన రూ. 30,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితుడి కుటుంబానికి అందజేశారు.సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు పెద్ద దిక్కు: ఈ సందర్భంగా చెన్ని బాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సీఎంఆర్ఎఫ్ కింద ఏటా సుమారు రూ. 1,000 కోట్లకు పైగా నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు.

ఈ పథకం ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఆర్థిక భరోసా దక్కుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సీఎంఆర్ఎఫ్ సహాయం అందుతుండటం హర్షించదగిన విషయమని ఆయన పేర్కొన్నారు. ఆపదలో ఉన్న తమను ఆదుకునేందుకు నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారుడు అంజూమ్, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి, సీనియర్ నాయకులు రాములు, బండారి బాల్రెడ్డి, గంట బుచ్చాగౌడ్, ద్యాగం లక్ష్మీనారాయణ, మిర్యాలకర్ చందు, పందిర్ల శ్రీనివాస్ గౌడ్, గంట వెంకటేష్ గౌడ్, బింగి మల్లేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

ఛండీఘడ్ ,ఏప్రిల్‌లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టెక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది.బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్ వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు



అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

# సీడ్ యాక్సిస్ రోడ్ రెడీ...



అమరావతి, ఆగస్టు 11,ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి ముహూర్తం ఖరారైంది. రాజధాని నగరానికి లైఫ్‌లైన్‌గా చెప్పుకుంటున్న సీడ్ యాక్సిస్ రోడ్డులోని అత్యంత కీలకమైన భాగం ఆగస్టు 13 నుంచి ప్రజలకు అందుబాటులోకి రాబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మక రహదారితోపాటు, ప్రజాప్రతినిధుల కోసం నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లను కూడా అదే రోజున అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి ఒక రోజు ముందు అంటే 12 ఆగస్టు ముఖ్యమంత్రి కాన్వాయ్‌తో ఈ రహదారిపై అధికారికంగా ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో అత్యంత కీలకమైన ఈ రహదారిని టెక్నికల్‌గా ఇ-3 రోడ్డుఅని పిలుస్తారు. ఇది రాజధాని నగరంలోని ఉత్తరం నుంచి దక్షిణానికి ఉండే 17 ప్రధాన ఎన్ సిరీస్ రోడ్లను ఒకదానితో ఒకటి కలిపే మార్గం. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు మొత్తం పొడవు 21.78కిలోమీటర్లు. ఇది దొండపాడు గ్రామం వద్ద ప్రారంభమై రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి గ్రామాల మీదుగా సాగి మణిపాల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారితో కలుస్తుంది. ఈ రోడ్డుకు సంబంధించి రైట్ ఆఫ్ వే 60 మీటర్లుగా నిర్ణయించారు. భవిష్యత్‌లో దీనిని 8 నుంచి 9 లేన్‌ల వరకు విస్తరించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. ప్రస్తుతం 11 మీటర్ల వెడల్పుతో కూడిన క్యారేజ్ వేస్, సర్వీస్ రోడ్లు, సెంట్రల్ బీఆర్‌టీఎస్ కారిడార్‌తో నిర్మించారు.

మూడు దశల్లో అభివృద్ధి

ఈ భారీ ప్రాజెక్టును అధికారులు మూడు దశలుగా విభజించారు. ఫేజ్-1 పొడవు 14. 35 కిలోమీటర్లు. ఇది దొండపాడు నుంచి వెంకటపాలెం (మంతెన ఆశ్రమం) వరకు ఉంటుంది. ఇది ఇప్పటికే పూర్తి అయ్యి రాకపోకలు సాగుతున్నాయి. రెండోది 3.92 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -2. వెంకటపాలెం నుంచి ఉండవల్లి వరకు సాగుతుంది. ఈ భాగమే ఆగస్టు 13న ప్రారంభమవుతుంది. భూసేకరణ సమస్యలు, కోర్టు వ్యాజ్యాలను అధిగమించి ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. 3.50 కిలోమీటర్ల పొడవు ఉన్న ఫేజ్ -3 ఉండవల్లి నుంచి మణిపాల్ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్నారు. ఇందులో ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ 320 మీటర్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ రహదారిలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నవి ఉండవల్లి వద్ద నిర్మించిన భారీ స్టీల్ బ్రిడ్జ్‌లు. 110 మీటర్ల పొడవుతో బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి నిర్మించారు. దానిపై తారు పనులు పూర్తి చేశారు. రాజధానికి వరద ముప్పు లేకుండా చేసే కొండవీటి వాగుపై 284మీటర్‌ల పొడవుతో అధునాతన స్టీల్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని కేవలం ఒక రహదారిగానే కాకుండా, ఒక పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణానది, కొండవీటి వాగు అందాలను చూసేందుకు ఇక్కడ ప్రత్యేక వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణహితంగా ఉండేందుకు సైక్లింగ్ ట్రాక్‌లు, వాకింగ్ ట్రాక్‌లు, సుందరమైన ల్యాండ్‌స్కేప్ గార్డెన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడ నుంచి అమరావతి సచివాలయానికి హైకోర్టుకు వెళ్లే వేల మంది ఇరుకైన కరకట్ట రహదారిపై ఆధారపడేవారు. ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదకరమైన మలుపులు, గుంతల రోడ్డులతో ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. ఈ సీడ్ యాక్సిస్ రోడ్డు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేందుకు సమయం ఆదా అవుతుంది. దాదాపు అర గంట కలిసి వస్తుంది. నాలుగు లేన్ల రహదారి కావడంతో ప్రమాదాల భయం లేదు. ఈ కారిడార్ వెంబడి ఉన్న ఉండవల్లి, పెనుమాక, మందడం ప్రాంతాల్లో భూముల రేట్లు పెరగనున్నాయి. ఐటీ కంపెనీలు, హోల్స్ రానున్నాయి. ముఖ్యమంత్రి పర్యటన కోసం అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎస్పీ వకుల్ జిందాల్ ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లు సమీక్షించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన సీడ్ యాక్సిస్ రోడ్డు ప్రాజెక్టు కోసం మొత్తం 320. 54 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో ఇప్పటికే 278.93 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ రహదారి కేవలం రవాణా కోసమే కాకుండా రాజధాని నగరంలో గ్యాస్ పైప్‌లైన్లు, వాటర్ మెయిన్స్, ఐసీటీ కారిడార్లు వంటి భూగర్భ వసతుల ఏర్పాటుకు ఉపయోగపడనుంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140